క్లుప్తంగా

పి.వి.ఎన్.మాధవ్‌కు పూర్వ విద్యార్థుల సత్కారం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్‌ను ఆయనతోపాటు డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సత్కరించారు. శుక్రవారం పిఠాపురం కాలనీలోని స్వగృహంలో ఆయనకు గజమాల వేసి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సహచర విద్యార్థి మాధవ్ జాతీయ పార్టీ బీజేపీకి రాష్ట్ర రథసారథిగా ప్రతిష్టాత్మకమైన పదవిని చేపట్టడం గర్వంగా ఉందని వారంతా ఉప్పొంగిపోయారు.

నేడు అభినందన సభ

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడైన పి.వి.ఎన్.మాధవ్ అభినందన సభ శనివారం సాయంత్రం 5 గంటలకు అక్కయ్యపాలెం పోర్ట్ కళావాణి స్టేడియంలో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. బీజేపీ విశాఖ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేయనున్నారు.

వంగవీటి రంగాకు నివాళి



వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాపుసేన నాయకులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో కాపు సేన నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహనరంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్దనున్న వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ మోహనరంగా పేదలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్, ఎంవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో అనాథ పిల్లలకు పళ్లు, కేకులు, రొట్టెలు పంపిణీ చేశారు. కాపు సేన నాయకులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో కొండచిలువ కలకలం



ఆరిలోవ కాలనీలో పట్టుకున్న కొండచిలువ

ఆరిలోవ: ఆరిలోవ కాలనీలో శుక్రవారం సాయంత్రం కొండచిలువ కలకలం రేపింది. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ ఆఖరి బస్టాప్ దరి కంబాలకొండను ఆనుకొని ఉన్న ఆపరేషన్ కాలనీలో సాయంత్రం 6.30 గంటల సమయంలో సుమారు 11 అడుగుల కొండచిలువ నివాసాల మధ్య వీధిలోకి ప్రవేశించింది. దాన్ని చూసిన స్థానికులు పరుగులు తీశారు. కొందరు ఇళ్ల తలుపులు మూసుకొని కేకలు వేశారు. దీంతో స్థానిక యువకులు కొందరు అటవీ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. కొండచిలువను చాకచక్యంగా పట్టుకుని జూ పార్కుకు తరలించారు. జూ వెటర్నరీ వైద్యులు దాన్ని పరిశీలించి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలపడంతో అక్కడి నుంచి తీసుకువెళ్లి కంబాలకొండల్లో విడిచిపెట్టారు.

సమస్యలు పరిష్కరించండి



మద్దిలపాలెం డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

మద్దిలపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా రవాణా శాఖలో ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మద్దిలపాలెం డిపో గేట్ వద్ద శుక్రవారం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 129 డిపోలు, నాలుగు వర్క్‌షాప్ యూనిట్ల వద్ద ధర్నా, గేట్ మీటింగ్‌లో సమస్యలు పేర్కొంటూ స్లోగన్లు–ప్లకార్డులు ప్రదర్శించామని ఎంప్లాయిస్ యూనియన్ మద్దిలపాలెం డిపో సెక్రటరీ రెడ్డి తెలిపారు.

చేనేత.. చేయూత



కరకచెట్టు పోలమాంబ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శన

- పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ కల్యాణ మండపంలో హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు
- కళాకారుల పనితనానికి అద్దం పడుతున్న ఆవిష్కరణలు
- చీరలు, ఆభరణాలు, దుస్తుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న నగరవాసులు
- హస్తకళలను ప్రోత్సహించాలని కోరుతున్న కళాకారులు



పురుషుల చొక్కాలు

బీచ్‌రోడ్డు: దేశంలో ప్రసిద్ధి చెందిన చేనేత వస్త్రాలు, హస్తకళలకు చేయూతనిచ్చేందుకు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు చేనేత హస్తకళా ప్రదర్శనలు ఏర్పాటవుతుంటాయి. ఈ క్రమంలో భావన రుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ అమ్మవారి కల్యాణ మండపంలో ఈ నెల 3న హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. పలు రాష్ట్రాల నుంచి నేరుగా చేనేత వస్త్రాలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు నిర్వాహకుడు సురేష్ తెలిపారు. ఈ నెల 13 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన హస్తకళలను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్రాలు, వస్తువులు

చేనేత పట్టు, కాటన్ చుడీదార్లు, టాప్‌లు, డ్రెస్ ఎగ్జిబిషన్‌లో ఉంచిన హారాలు, వివిధ రకాల ఆభరణాలు మెటీరియల్స్, మహిళలకు కలంకారీ, వెంకటగిరి, నారాయణపేట చీరలు, పోచంపల్లి, ఖాదీ, డిజిటల్ ప్రింట్స్, వెంకటగిరి, బెంగాలీ కాటన్, మంగళగిరి, ఉప్పాడ, ఫ్యాన్సీ, మంగళగిరి కాటన్ చీరలు, బెంగాలీ సిల్కర్, కాంతా వర్క్ కాటన్, భాగల్పూరీ సిల్క్, గుజరాత్ డిజైనర్ టాప్స్, లక్నో చికెన్ వర్కక్స్, లక్నో నైటీలు, డోర్ కర్టెన్లు, చేతితో తయారు చేసిన వివిధ రకాల మ్యాట్లు, డోర్ మ్యాట్లు, వరంగల్ టవల్స్, బెడ్‌షీట్లు, జైపూర్, రాజస్థాన్ కాటన్ బెడ్‌షీట్లు ఇలా ప్రత్యేక రంగులు, డిజైన్లతో ఇక్కడి సామగ్రి అందరినీ ఆకట్టుకుంటోంది.



ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల ఆభరణాలు

పురుషుల కోసం..

సాధారణంగా ఎగ్జిబిషన్ అంటే మహిళల కోసమే ఎక్కువ వస్త్రాలు, ఆభరణాలు ఉంటాయి. ఈ చేనేత ప్రదర్శనలో మగవారి కోసం కాటన్ షర్ట్‌లు, టవళ్లు, లుంగీలతోపాటు కొండపల్లి బొమ్మలు, హ్యాండ్ బ్యాగ్‌లు, పర్స్‌లు, తమిళనాడు 1 గ్రామ్ గోల్డ్ హారాలు, ఆభరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఏటా కళాకారులు స్వయంగా తయారు చేసిన వస్తువులు తీసుకొచ్చి విక్రయిస్తారు.



మహిళలను ఆకర్షించే చీరలు

వలు రాష్ట్రాల నుంచి ఉత్పత్తులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల నుంచి తయారీదారులు వారి ఉత్పత్తులను నేరుగా ప్రదర్శనలో విక్రయిస్తున్నారు. స్వయం ఉపాధి కార్మికులు తాము స్వయంగా తయారు చేసిన హస్తకళలను ప్రోత్సహించాలని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఇంటికి సమీపంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పోచంపల్లి చేనేత వస్త్రాలు విక్రయిస్తున్న సత్యనారాయణ

కళాకారులను ప్రోత్సహించాలి

ఏడాది కాలంగా కష్టపడి తయారీ చేసిన చేనేత వస్త్రాలు, వస్తువులకు చేయూత కావాలని కళాకారులు కోరుతున్నారు. ఎగ్జిబిషన్ 10 నుంచి 15 రోజుల పాటు నిర్వహిస్తున్నామని, వినియోగదారులు చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు ముందుకొస్తారని ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు తక్కువగా ఉన్నాయని విక్రయదారులు చెబుతున్నారు. చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మా కుటుంబానికి జీవనాధారం

మా కుటుంబంలో మొత్తం 10 మంది సభ్యులుంటాం. మా జీవనాధారం చేనేత వస్త్రాలే. పదేళ్లుగా తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా పలు ఎగ్జిబిషన్లలో మా వస్త్రాలను విక్రయించడానికి తీసుకొస్తున్నాం. మాకు వేరే పని గాని, వ్యాపారం కాని తెలీదు. కేవలం చేనేత వస్త్రాల అమ్మకాలపైనే మా కుటుంబం ఆధారపడి ఉంది.

– సత్యనారాయణ, పోచంపల్లి

ఆరేళ్లుగా చేనేత ప్రదర్శనలు



మా సేవా సమితి ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న చేనేత, హస్తకళలను ప్రోత్సహించేందుకు, చేయూత అందించేందుకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. విశాఖలో ఆరేళ్లుగా వివిధ ప్రాంతాల్లో చేనేత ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. వినియోగదారులు చేనేత, హస్తకళలకు అండగా ఉండేందుకు ఆసక్తి చూపించాలని కోరుతున్నాం.

– సురేష్, అధ్యక్షుడు, భావనారుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి

వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరుతో రుషికొండ ఏ1 గ్రాండ్ హోటల్ శనివారం జరిగే వైఎస్సార్‌సీపీ సమావేశానికి తూర్పు నియోజకవర్గ శ్రేణులంతా హాజరు కావాలని సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ కేడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తుకు తెస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సభ జరుగుతుందన్నారు. ప్రతి వార్డు నుంచి అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ఐ.హెచ్.ఫారూఖీ, మువ్వల సురేష్, పల్లా దుర్గారావు, పేర్ల విజయచందర్, అల్లంపల్లి రాజాబాబు, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, పులగం కొండారెడ్డి, పీతల గోవింద్, మదు పాడ రవి, బోండా ఉమామహేశ్వరరావు, జోషిలా, పీలా ప్రేమ్, వాసుపల్లి యల్లాజీ, సురాడ వెంకటలక్ష్మి, సీరజ్ కుమార్, పతివాడ కనకరాజు, వైదా నారాయణరావు, ముగడ రమేష్, మక్బూల్, సత్యాల వెంకట్, శిరీష, వెంకటలక్ష్మి, సాగరిక, మరియదాసు, చొల్లంగి నాగేశ్వరరావు, కనకల కృష్ణ, రావల, చెంబూరు, వెంకటరావు, కమల్, వేణుగోపాలరెడ్డి, తులసి, నీలారెడ్డి, పిల్లా సత్యవతి, ఉమ్మిడి కల్యాణ్, రవికిరణ్‌రెడ్డి, కుమార్ రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, బూస రమణ రెడ్డి, మారుపల్లి పరదేశి, ఈశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు కళాభారతిలో సత్యభామ నృత్యోత్సవాలు



కథాకళి, కూచిపూడి నృత్యకారిణులు పరిమిత ముఖర్జీ, గీతా నారాయణ్

మద్దిలపాలెం: సత్యభామ యువ నృత్యోత్సవం పేరిట అంతర్జాతీయ స్థాయి భారతీయ శాస్త్రీయ నృత్యోత్సవాలు శని, ఆదివారాల్లో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరగనున్నాయి. వేడుకల్లో ప్రతిష్టాత్మకమైన సత్యభామ నేషనల్ అవార్డులు–2025ను ప్రసిద్ధి నాట్య కళాకారులకు ప్రదానం చేయనున్నామని నటరాజ్ మ్యూజిక్ – డ్యాన్స్ అకాడమీ, అంతర్జాతీయ నృత్య మండలి వ్యవస్థాపకుడు బి.ఆర్.విక్రమ్‌కుమార్ బత్తిన తెలిపారు. తొలి రోజు శనివారం ప్రదర్శనలో భాగంగా నృత్యకారిణులు గీతా నారాయణ్ సుదగాని–కూచిపూడి(ఆంధ్రప్రదేశ్), అమెరికాకు చెందిన సంజనా పుట్ట–కూచిపూడి నృత్య ప్రదర్శన, తమిళనాడుకు చెందిన డాక్టర్ మనీషా మిట్టల్ భరతనాట్యం, కేరళకు చెందిన అపర్ణ శర్మ కేరళ నాట్యం ప్రత్యేక ప్రదర్శనతోపాటు కర్ణాటకకు చెందిన లక్ష్మీశ్రవణ్ భరతనాట్య ప్రదర్శనలుంటాయి. రెండో రోజు ఆదివారం ప్రఖ్యాత యువ కళాకారుల నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. నృత్యకారులు కోల్‌కతా, మణిపురిలకు చెందిన పరిమిత ముఖర్జీ, సుమనా– కథాకళి ప్రదర్శన, తమిళనాడు భరనాట్య కళాకారిణి నివేదిత సతీష్‌కుమార్ ప్రదర్శన, పశ్చిమ బెంగాళ్‌కు చెందిన సుమనా చటర్జీ–మణిపురి నృత్యం, కర్ణాటకకు చెందిన పృథ్వీజన భరతనాట్య ప్రదర్శనతోపాటు అవ్వారు దివ్యశ్రీ కూచిపూడి నృత్యం, ఎన్.జైశ్య శ్రీరెడ్డి కూచిపూడి నాట్య విన్యాసాలుంటాయి. రెండు రోజుల ఉత్సవానికి దేశం నలుమూలల నుంచి నృత్యోత్సవ డైరెక్టర్లు, కళాకారులు హాజరవుతున్నారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

మద్దిలపాలెం: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న తలపెట్టిన ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. ఎంఎంటీసీ హెచ్‌బీ కాలనీలోని షిర్డీసాయి ఆటో స్టాండ్ వద్ద శుక్రవారం జరిగిన ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, డ్రైవర్లకు ప్రమాదకరంగా ఉన్న 21, 31 జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల టెస్టుల సర్వీసులను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే ప్రతిపాదనను వెంటనే ఆపి ప్రభుత్వమే నడపాలన్నారు. వాహన మిత్ర పథకాన్ని సీఎం చంద్రబాబు వెంటనే అమలు చేయాలన్నారు. బంద్‌లో ఆటో డ్రైవర్లు పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, ఎన్.మధురెడ్డి, యూనియన్ నాయకులు అవనాపు శ్రీను, ముత్యాల నాయుడు, హరి, రమణ, సత్య తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వల తొలగింపుతో దోమల నివారణ

మద్దిలపాలెం: వర్షాలు కురిసి వెలుస్తున్న క్రమంలో ఇంటి పరిసరాల్లో పేరుకుపోయిన నీటి నిల్వలను తక్షణమే తొలగించుకోవాలని, లేకుంటే అవే దోమల ఉత్పత్తికి కేంద్రాలవుతాయని జీవీఎంసీ జోన్–3 ఏఎంహెచ్‌వో డాక్టర్ బి.ప్రసాదరావు అన్నారు. ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా పిఠాపురం కాలనీలో స్థానికులకు డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరసరాల్లో నీటి నిల్వలను గుర్తించి, తొలగించాలన్నారు. ఖాళీ టైర్లు, రుబ్బరోళ్లు, ప్లాస్టిక్ సీసాలు, గ్లాసు, థార్మా మడతలు, షూష్ ఇలా నీటి నిల్వలకు అవకాశాలుండే వాటిని గుర్తించి తొలగించాలని సూచించారు. అనంతరం జోన్–3 మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు దోమల ఉత్పత్తి ప్రక్రియను వివరించారు. నీటి నిల్వలో పేరుకుపోయిన లార్వాను ప్రదర్శించారు.

జేమ్స్ స్టీఫెన్‌కు గ్లోబల్ రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డ్



అవార్డు స్వీకరిస్తున్న ఏయూ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్‌కు ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. పోలాండ్ బైడ్ గోస్ట్జ్‌లోని డబ్ల్యూఎస్‌జీ యూనివర్సిటీలో జరిగిన నెట్ వర్కింగ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఎక్స్‌పర్ట్ అప్లికేషన్స్ అండ్ సెక్యూరిటీ స్ప్రింగర్ అంతర్జాతీయ సదస్సులో ముఖ్య వక్తగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేమ్స్ స్టీఫెన్‌కు అవార్డు ప్రదానం చేశారు.

పోరాట స్ఫూర్తికి ప్రతీక.. అల్లూరి

- మన్యం వీరుడి జయంతి వేడుకల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్
- వాడవాడలా ఘనంగా నివాళులు



కృష్ణా డిగ్రీ కళాశాలలో అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఏయూక్యాంపస్: స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని అల్లూరి విగ్రహానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి.. ఆదివాసీలను చైతన్యవంతం చేసి స్వాతంత్య్ర పోరాటం దిశగా నడిపిన విధానం స్ఫూర్తిదాయకమన్నారు. అటువంటి మహనీయులను స్మరించుకోవడం, వారి జీవితం నుంచి స్ఫూర్తిని పొందుతూ దేశం కోసం పని చేయాలని యువతకు సూచించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటాలు

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. బీచ్ రోడ్డులోని అల్లూరి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అల్లూరి స్ఫూర్తికి విరుద్ధంగా అటవీ భూములను అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అటవీ భూముల సంరక్షణకు, గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాడుతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్, సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.నాగభూషణరావు, ఎం.మన్మధరావు పాల్గొన్నారు.

- అల్లూరి సీతారామరాజు ప్రజల గుండెల్లో సజీవంగా నిలిచిపోయారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్.పరశురామరాజు అన్నారు. బీచ్ రోడ్డులోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.ప్రకాష్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి విజయానంద రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్‌యాదవ్, శ్రీరంగం ధనేశ్వరరావు, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఏయూలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు, విద్యార్థులు

అల్లూరికి భారతరత్న ప్రకటించాలి

ఎంవీపీకాలనీ: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశ సాంతంత్య్రం కోసం ఆంగ్లేయులకు ఎదురొడ్డి పోరాడిన అల్లూరికి భారత అత్యున్నత పౌర పురస్కారంతోనే అసలైన నివాళి అన్నారు. ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని, లంబసింగిలో నిర్మిస్తున్న అల్లూరి మ్యూజియాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

తెలుగు జాతి ఆణిముత్యం

మద్దిలపాలెం: దేశ స్వాతంత్య్రోద్యమంలో కీలక భూమిక పోషించిన అల్లూరి సీతారామరాజు తెలుగు జాతిలో జన్మించడం గర్వకారణమని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఏయూ న్యాయ కళాశాల వద్దనున్న అల్లూరి విగ్రహానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ స్వయంగా అల్లూరి సీతారామరాజుపై ఒక కవితను రాసి చదివి వినిపించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ అల్లూరి నుంచి స్ఫూర్తిని నేటి యువతరం పొందాలని సూచించారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు, అధికారులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం స్ఫూర్తిదాయకం

డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ పోల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి త్యాగం, ధైర్యం నేటి విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయన్నారు. అధ్యాపకురాలు ఎ.ఎల్.రూపవాణి మాట్లాడుతూ సీతారామరాజు చేసిన త్యాగాలను కొనియాడారు. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా అల్లూరి గొప్ప సాయుధ పోరాటం చేశారని డాక్టర్ జి.వి.ప్రతాప్ అన్నారు. జాతీయ సేవా పథకం అధికారులు బి.లక్ష్మి, బి.నాగేశ్వరరావు, చరిత్ర అధ్యాపకులు వి.సూర్యనారాయణ, బి.రాజారావు అల్లూరి సీతారామరాజు గురించి అద్భుతంగా మాట్లాడిన విద్యార్థిని వి.లక్ష్మిని బహుమతులతో సత్కరించారు.



బీచ్ రోడ్డులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్



రామకృష్ణాపురంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోరాట యోధుడు

ఆరిలోవ: కైలాసగిరి వద్ద ఏఆర్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అధికారులు, సిబ్బందితో కలిసి అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడటంతోపాటు మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటం చేశారన్నారు. రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు బి.రామకృష్ణ, అరవింద్ కిశోర్, సంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

- 13వ వార్డు రామకృష్ణాపురంలోని బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు పక్కనున్న అల్లూరి విగ్రహానికి కార్పొరేటర్ కెల్ల సునీత, పలు రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బీచ్ రోడ్డులో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



ఏఆర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పరశురామరాజు, బీజేపీ నాయకులు

కేంద్ర కారాగారం సందర్శన



మహిళా ముద్దాయిలతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారాన్ని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలు లోపల ఖైదీలు ఉండే బ్యారక్‌లను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు, ఇతర అధికారులతో కలిసి స్వర్ణముఖి బ్లాక్‌ను పరిశీలించిన న్యాయమూర్తి, అందులో ఉన్న మహిళా ముద్దాయిలతో మాట్లాడారు. ఏఏ నేరాలపై వారు జైలుకు వచ్చారు, జైలుకు రావడానికి దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు జైలుకు రావడం వల్ల వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కూడా ఆరా తీశారు. ఖైదీలకు జైలులో కల్పిస్తున్న సౌకర్యాలు, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్న న్యాయమూర్తి, ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు పాల్గొన్నారు.

అద్భుతంగా కనకపుష్యరాగం నాటిక



కనకపుష్యరాగం నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి శుక్రవారం ప్రదర్శనలో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కనకపుష్యరాగం నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికను 40 ఏళ్ల కిందట ఆంధ్రా యూనివర్సిటీ స్టేజ్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు డైరెక్ట్ చేయగా.. ఎస్కే మిశ్రో నటించారు. ఇన్నేళ్ల తర్వాత ఎస్కే మిశ్రో దర్శకుడిగా కనకపుష్యరాగం నాటికలోని ప్రతి సన్నివేశాన్ని కళాత్మకంగా రూపకల్పన చేసి ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నారు. అప్పటిలాగే ఇప్పుడు కూడా ఈ నాటికకు మంచి ఆదరణ లభించింది. కళాభారతి ఆడిటోరియం ప్రేక్షకులతో కిక్కిరిసిపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రతి సన్నివేశానికి ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో నటీనటుల నటనకు పట్టం కట్టారు. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి నాటికను ప్రారంభించారు. విజయవాడకు చెందిన నాటకం హిమాద్రి మిశ్రో దృశ్య వేదిక సమర్పణలో ఈ నాటకం ప్రదర్శించారు. దీని రచన దివంగత రాఘవ, దర్శకత్వం మిశ్రో, నిర్వహణ హెచ్.వి.ఆర్.ఎస్.ప్రసాద్, ఆహార్యం శ్రీధర్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పి. వి.భాస్కర శర్మ సహకారం అందించారు.